

ముగిసిన ఎపిఇఎపి సెట్ ప్రవేశ పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఇంజినీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకుగాను గత వారం రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఎపిఇఎపి సెట్ ప్రవేశ పరీక్షలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజు ఇంజినీరింగ్ విభాగంలో స్థానిక శ్రీ వాసవీ ఇంజినీరింగ్ కళాశాల పరీక్షా కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 238 మందికిగాను 234 మంది పరీక్ష రాసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకర్‌రావు తెలిపారు. పరీక్షా కేంద్రం కోఆర్డినేటర్ నటరాజ్, సిస్టమ్స్ అడ్మిన్ కొల్లా సురేష్, టిసిఎస్ ప్రతినిధులు పరీక్ష నిర్వహణను పర్యవేక్షించారు.



పరీక్షకు వెళ్తున్న విద్యార్థులు

ఇల్లు కట్టేదెలా..!

భారంగా నిర్మాణ సామగ్రి ధరలు

రెండు గదులు, హాలుతో ఇంటి నిర్మాణానికి రూ.20 లక్షలుపైనే

హడలిపోతున్న సామాన్య ప్రజానీకం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సామాన్య ప్రజానీకానికి సొంతింటి కల అందని ద్రాక్షగా మారింది. పెరిగిన నిర్మాణ సామగ్రి ధరలతో సామాన్యులు ఇల్లు కట్టాలంటేనే హడలిపోయే పరిస్థితి నెలకొంది. నలుగురు సభ్యులు ఉన్న కుటుంబం రెండు పడక గదులు, హాలు, వంటగది ఉన్న ఇంటి నిర్మాణం చేయాలంటే రూ.20 లక్షలుపైనే ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఇంటి నిర్మాణంవైపు ఆలోచించాలంటేనే సామాన్య ప్రజానీకం వణికిపోతున్నారు. ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే సాయానికి, అయ్యే ఖర్చుకు పొంతన లేకపోవడంతో ఇంటి నిర్మాణంవైపు సామాన్యులు ఆలోచించడం వదులుకుంటున్నారు. అత్యధికం మంది సొంతిల్లు నిర్మాణాలను వేసవిలో ఎక్కువ చేపడతారు. వాతావరణం అనుకూలంగా ఉంటుందని ఆలోచన చేస్తారు. ప్రస్తుత వేసవిలో కొత్త ఇంటి నిర్మాణాలు పెద్దగా సాగడం లేదని తాపీపనివారు చెబుతున్నారు. అందుకు ప్రధాన కారణం ఒక్కటే. సామాన్యులు భరించలేని స్థితికి నిర్మాణ వ్యయం పెరిగింది. ప్రభుత్వం జిల్లాలో లక్షకుపైగా ఇంటిస్థలాలు ఇచ్చినప్పటికీ లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణం చేసేందుకు ముందుకు రాకపోవడానికి ప్రధాన కారణం నిర్మాణ వ్యయమే. ప్రస్తుత పరిస్థితుల్లో రెండు పడక గదులు, హాల్, వంటగది తరహా ఇంటి నిర్మాణం చేయాలని సామాన్య ప్రజానీకం ఆలోచిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టన్ను ఐరన్ ధర రూ.66 వేలు పలుకుతోంది. ఇసుక ఐదు యూనిట్లు లారీ ధర రూ.17,500 ఉంది. వెయ్యి ఇటుక ధర రూ.30 వేలు,



సిమెంట్ బస్తా ధర రూ.325కు చేరింది. ఇల్లు నిర్మించడానికి తాపీపని వారి ఖర్చు రూ.ఆరు లక్షల వరకూ అవుతోంది. ఇవికాకుండా గుమ్మాలు, కిటికీలు, విద్యుత్ సామాన్లు, ఇతర ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. దీంతో ఇల్లు కట్టాలంటే వెనుకాడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ ఇళ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు ప్రభుత్వం రూ.రెండు లక్షలు మాత్రమే సాయం చేస్తోంది. ఈ సొమ్ము విడుదలకు కూడా సవాలక్ష ఆంక్షలు పెడుతోంది. ప్రభుత్వం ఇచ్చే సాయం ఏమాత్రం పెంచడం లేదు. దీంతో ఇంటి నిర్మాణానికి దిగితే అప్పుల పాలయ్యే పరిస్థితి ఏర్పడింది. దీంతో కష్టపడి కట్టిన ఇంటిని అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంటి నిర్మాణానికి బ్యాంకులు హౌసింగ్ లోన్లు ఇస్తున్నాయి. అయితే ప్రొసెసింగ్ ఫీజుల రూపంలో రూ.25 వేలకుపైగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంటుంది. వ్యవసాయ పనులు చేసుకునే సామాన్య ప్రజానీకం ప్రతినెలా బ్యాంకులకు ఇఎంఐలు కట్టడం కష్టతరమైన పని కావడంతో సామాన్యుల భయపడుతున్నారు. భూముల ధరలు పెరిగిపోవడంతో సామాన్యులు సెంటు భూమీ కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడు సొంతిల్లు సైతం కట్టుకోలేని పరిస్థితి నెలకొంది. సామాన్య ప్రజానీకం రూ.20 లక్షలు ఖర్చుపెట్టి ఇంటి నిర్మాణం చేయడం ఏమాత్రం సాధ్యంకాని పరిస్థితిగా మారిపోయింది. దీంతో చాలామంది ఇప్పటికే ఉన్న చిన్నపాటి ఇంటిలోనే కాలం గడుపుతుండగా, అద్దె ఇంట్లో ఉండేవాళ్లు అదేరీతిలో ఉండిపోతున్నారు. పేదోడి సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం సాయం పెంచాల్సి ఉంది. లేకపోతే సామాన్యుల బతుకులు 'ఎక్కడవేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉండిపోనున్నాయి.

ఐరన్ టన్ను రూ.66 వేలు

సిమెంట్ బస్తా రూ.325

ఇసుక ఐదు యూనిట్లు రూ.17,500

4 వేల ఇటుక ఖరీదు రూ.30 వేలు

ఇంటి నిర్మాణానికి తాపీవారి ఖర్చు రూ.ఆరు లక్షలుపైనే

ఓట్ల లెక్కింపునకు ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు

కలెక్టర్ సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఓట్ల లెక్కింపునకు పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేపట్టినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ తెలిపారు. గురువారం అమరావతిలోని సచివాలయం కాన్ఫరెన్స్ హాల్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. భీమవరం కలెక్టరేట్‌లోని విసి హాలు నుంచి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తోపాటు డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు పాల్గొన్నారు. జిల్లాలో జరుగుతున్న ఏర్పాట్లను సుమిత్‌కుమార్ వివరించారు. జిల్లాలో రెండు కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ ఏర్పాట్లను రానున్న నాలుగు రోజుల్లో పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. కౌంటింగ్ సిబ్బందికి శిక్షణా తరగతులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు పార్లమెంటరీ నియోజకవర్గానికి 10 టేబుల్స్, ప్రతి నియోజకవర్గానికి 4 టేబుల్స్ చొప్పున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గానికి మరో ఐదు టేబుల్స్ ఏర్పాటుకు అనుమతికి ప్రతిపాదనలు సమర్పించినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించామని, అదే మాదిరిగా ఓట్ల లెక్కింపునకు సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తున్నామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలన

భీమవరం విష్ణు కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇవిఎంల స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద భద్రతా చర్యలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం పరిశీలించారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా స్ట్రాంగ్‌రూమ్‌లను డిఆర్ఒతో కలిసి తనిఖీ చేశారు. స్ట్రాంగ్‌రూమ్‌కు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. అక్కడ పరిస్థితులను గమనించారు. భద్రతా సిబ్బంది, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు అనువైన హాళ్లను పరిశీలించారు. లెక్కింపునకు అనువుగా వున్న టేబుల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలిపారు. తొలుత ఓట్ల లెక్కింపు రోజున మీడియాకు ఫలితాల వివరాలను అందించేందుకుగాను మీడియా సెంటర్ ఏర్పాటు చేయనున్న క్రమంలో సంబంధిత భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించేందుకుగాను తగిన చర్యలు తీసుకోవాలని, సంబంధిత ఏర్పాట్లు చేయాలని డిపిఆర్ఒకు సూచించారు. కలెక్టర్ వెంట డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావు, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

కొనసాగిన ఫుడ్ ఫ్యాట్స్ కార్మికుల దీక్షలు

యాజమాన్యం మొండివైఖరి వీడకపోతే సమ్మెలోకి - సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఫుడ్‌ఫ్యాట్స్ యాజమాన్యం మొండివైఖరి వీడి వెంటనే వేతన ఒప్పందం చేయాలని 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు), సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ప్రధాన గేటు వద్ద రిలే నిరాహారదీక్షలు గురువారం నాల్గో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు సిరపరపు రంగారావు, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్, జాయింట్ సెక్రటరీ మామిడి దానవరప్రసాద్ సందర్శించి సంఘీభావం తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్.రామ్మోహన్ మాట్లాడుతూ 3ఎఫ్ కార్మికులకు ప్రతి నాలుగు సంవత్సరాలకోసారి వేతన ఒప్పందం జరుగుతుందని, అయినా 3ఎఫ్ యాజమాన్యం నూతన వేతన ఒప్పందం అమలు చేయకపోవడం దుర్మార్గమైన చర్యని అన్నారు. ఇప్పటికైనా 3ఎఫ్ యాజమాన్యం మొండివైఖరి వీడి వెంటనే వేతన ఒప్పందం అమలు చేయాలని డిమాండ్ చేశారు. 2023 మార్చితో గత వేతన ఒప్పందం పూర్తయినప్పటికీ యాజమాన్యం నూతన వేతన ఒప్పందం అమలు చేయకుండా కాలయాపన చేయడం దుర్మార్గమని అన్నారు. యాజమాన్యం మొండివైఖరిపై లేబర్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం మొండివైఖరి వీడకపోతే రానున్న రోజుల్లో పెద్దఎత్తున ఆందోళన, నిరసన, సమ్మెకు వెనుకాడబోమని హెచ్చరించారు. కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, 3ఎఫ్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.గణేశ్వరరావు, సెక్రటరీ పెనుమాక శ్రీనివాస్, కమిటీ సభ్యులు, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలకు మద్దతు తెలుపుతున్న సిఐటియు నేతలు

బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు విస్తృతం చేస్తాం

జోనల్ మేనేజర్ శ్రీనివాస్జోనల్ మేనేజర్ శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

బ్యాంకింగ్ రంగంలో ఖాతాదారులకు విశిష్ట సేవలు అందించడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియా ముందు వరుసలో ఉందని, రానున్న రోజుల్లో సేవలను మరింత విస్తృతం చేస్తామని జోనల్ మేనేజర్ కె.శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని వైఎన్ కాలేజీ రోడ్డులోని కొండాలమ్మ గుడి ఆర్చి వద్దకు మార్చిన బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ నరసాపురం పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలకు 43 ఏళ్ల నుంచి బ్యాంక్ ఆఫ్ ఇండియా సేవలు అందిస్తుందని తెలిపారు. ఖాతాదారుల నమ్మకాన్ని మరింతగా పెంపొందించుకునే విధంగా సేవలందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను అధిగమిస్తూ రైతులకు, డ్వాక్రా సంఘాలకు రుణాలు అందించడంలో బ్యాంక్ ఆఫ్ ఇండియాదే పైచేయిగా నిలిచిందని వివరించారు. వ్యవసాయం, వ్యాపారం, బంగారు ఆభరణాలపై, గృహ నిర్మాణాలపై సకాలంలో రుణాలు మంజూరు చేసి ఖాతాదారుల మన్ననలు పొందిన సంస్థగా బ్యాంక్ ఆఫ్ ఇండియాకు మంచి గుర్తింపు లభించిందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎస్‌జివి.గాంధీనాయుడు, ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు వి.రవిశంకర్, యూనియన్ నాయకులు టి.సూర్యనారాయణ, బ్యాంక్ స్పెషల్ అసిస్టెంట్ రహీమ్, సిబ్బంది ప్రశాంత్, షారా, హిమదేవి, చిట్టిబాబు, ప్రవీణ్, జ్యోతి, స్వరూప్ రిటైర్డు సిబ్బంది పాల్గొన్నారు.



బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాస్

సమీక్షతో సరి

సాదాసీదాగా వీరవాసరం మండల సమావేశం

ప్రజాశక్తి - వీరవాసరం

మండల పరిషత్ సమావేశంలో సభా మర్యాదలు పాటించాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. ఎంపిపి అధ్యక్షతన గురువారం నిర్వహించిన మండల పరిషత్ సమావేశం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ విజయసారథి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఎంపిపి శాఖలవారీ సమీక్ష మాత్రమే నిర్వహించారు. సమావేశం ప్రారంభంలో బొబ్బనపల్లి సర్పంచి గూడూరి ఓంకారం ఇష్టానుసారంగా కూర్చుంటే కుదరదని, సభా మర్యాదలు పాటిస్తూ వరుస క్రమంలో కూర్చోవాలన్నారు. దీనికి ఓంకారం అభ్యంతరం వ్యక్తం చేస్తూ గతం నుండి ఈ విధంగానే కూర్చుంటున్నా లేని అభ్యంతరాలు ఇప్పుడు ఎందుకు పెడుతున్నారని ఎంపిపితో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఇష్టానుసారంగా కూర్చుంటే కుదరదని, తన ఆదేశాలు పాటించకపోతే బయటికి వెళ్లిపోవాలని ఎంపిపి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మిగిలిన సభ్యులు జోక్యం చేసుకుని ఓంకారానికి సర్దిచెప్పడంతో వరుస క్రమంలో కూర్చోవడంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం నిర్వహించిన సమీక్షలో సార్వా సాగుకు అవసరమైన సబ్సిడీపై విత్తనాల కోసం రైతులు ఆర్‌బికెల్లో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బిస్సీ.బాబు తెలిపారు. నందమూరుగరువులో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని ఎంపిటిసిలు గుళ్లిపల్లి విజయలక్ష్మీ, వాసాల వెంకటేశ్వరరావు ట్రాన్స్‌కో ఎఇ దృష్టికి తీసుకొచ్చారు. ఇదేవిధంగా నవుడూరులో మద్యం దుకాణం రోడ్డు పక్కనే ఉండటం వల్ల మందుబాబులు రోడ్డుపైకి వచ్చి మద్యం సేవిస్తున్నారని, దీంతో అటుగా రాకపోకలు సాగించే మహిళలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి యాళ్లబండి ఇందిర వెంకట జానకి లక్ష్మీ ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. జూన్ ఒకటో తేదిన కాలువలకు నీటిని విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ ఎఇ విజయకుమార్ తెలిపారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులతోపాటు వైస్ ఎంపిపిలు అడ్డాల రాము, చిలకపాటి ప్రకాశం, ఎంపిటిసిలు అంగర కుటుంబరావు, నాగరాజు పద్మకళ, కొల్లేపరి శ్రీనివాసరావు, సర్పంచులు యర్రంశెట్టి శ్రీను, వీరవల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మండల పరిషత్ సమావేశంలో వాగ్వివాదం

పెనుమంట్రతో మొదలై ఆచంటతో ముగింపు

ఆర్ఒ స్వామినాయుడు

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు భీమవరం విష్ణు క్యాంపస్‌లోని బి.సీతా పాలిటెక్నిక్ కాలేజీ రెండో అంతస్తులో చురుగ్గా సాగుతున్నాయని ఆచంట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.స్వామినాయుడు అన్నారు. కౌంటింగ్ కేంద్రాలపై గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్, ఎంపిడిఒలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ ఆచంట నియోజకవర్గానికి సంబంధించి 187 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు. ఓట్ల లెక్కింపు కార్యక్రమం నియోజకవర్గంలో పెనుమంట్ర మండలంతో ప్రారంభమై ఆచంట మండలంతో ముగుస్తుందన్నారు. పెనుమంట్ర మండలం సోమరాజు ఇలింద్రపర్రు పోలింగ్‌బూత్ ఇవిఎంతో కౌంటింగ్ ప్రారంభమవుతుందన్నారు. అనంతరం పెనుగొండ, పోడూరు, ఆచంట మండలాల పరిధిలోని పోలైన ఓట్లను లెక్కిస్తారన్నారు. చివరగా ఆచంట మండలం అయోధ్యలంక పంచాయతీ పరిధి పుచ్చల్లంక పోలింగ్ బూత్ ఇవిఎంతో కౌంటింగ్ పూర్తవుతుందని తెలిపారు. ఫారం-18 ఏజెంట్ నియామకపత్రాలను అందరికీ అందజేస్తామని, కౌంటింగ్ ఏజెంట్‌కు శిక్షణ ఇచ్చేందుకు అభ్యర్థులకు సూచనలు ఇచ్చామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు ఐపి.శెట్టి, ఆర్‌వివి.రోహిణిదేవి, కె.లక్ష్మీకళ్యాణి, ఎంపిడిఒలు పి.నరసింహ ప్రసాద్, ఎస్.శ్రీనివాస్ దొర, పి.పద్మజ, డి.సుహాసిని, ఎన్నికల డిప్యూటీ తహశీల్దార్ ఎం.రామప్రసాద్‌రాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్ఒ స్వామినాయుడు

రైతుల ఖాతాల్లో సొమ్ము ధాన్యం జమ చేయాలని ధర్నా

ప్రజాశక్తి - వీరవాసరం

రబీ ధాన్యం అమ్మి నెల రోజులు దాటినా రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారని, వెంటనే వారి ఖాతాల్లో సొమ్మును జమ చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల హరేరాం డిమాండ్ చేశారు. వీరవాసరం మండల సర్వసభ్య సమావేశం హాల్ వద్ద రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జుత్తిగ నరసింహమూర్తి అధ్యక్షతన గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ పంట కాలువలు, మురుగు కాలువల్లో పూడికలు తీయకపోవడం వల్ల నారుమడులు, పంటలు నీట మునిగి రైతులు ప్రజలు తీవ్రంగా పోతారన్నారు. మండలంలోని బసవరాజు కోడు, గొంతేరు డ్రెయిన్, పొలమూరు డ్రెయిన్, దేవరకోడు, తొక్కోడు డ్రెయిన్ల ప్రక్షాళన పనులు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ అధికారులు కాలువలపై దృష్టి పెట్టకపోవడం వల్ల పంట నష్టం ఎక్కువగా ఉంటుందన్నారు. నూక శాతం పేరుతో అదనంగా మూడు నుంచి ఐదు కేజీల వరకూ ధాన్యాన్ని తీసుకుంటూ రైస్ మిల్లర్లు రైతులను దోపిడీ చేస్తున్నారని, అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. ఖరీఫ్ నాటికి రైతు భరోసా కేంద్రాల ద్వారా 1318, పిఎల్ వంటి విత్తనాలు సబ్సిడీపై అందించాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్లా చిన్న వీరభద్రం మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, 200 రోజులు పని కల్పించాలని, బడ్జెట్లో నిధులు ఎక్కువ కేటాయించాలని డిమాండ్ చేశారు. అనంతరం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేసి ఇరిగేషన్ అధికారులతో, అగ్రికల్చర్ అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యాళ్ల బండి నారాయణమూర్తి, లింగం సత్యనారాయణ, అయినంపూడి బాబూరావు, కేతా జ్యోతి బస్సు, మైగాపుల త్రిమూర్తులు, బోర్రా అల్మహరాజు, పోతుల మృత్యుంజయ, బొబ్బలపల్లి సూర్యచంద్రం, పాల్గొన్నారు.



వీరవాసరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతు సంఘం నేతలు

పది సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఎంఇఒ పి.పుష్పరాజ్యం

ప్రజాశక్తి - నరసాపురం

పది సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని మండల విద్యాశాఖ అధికారి పి.పుష్పరాజ్యం తెలిపారు. గురువారం ఎంఇఒ విలేకరులతో మాట్లాడారు. ఈనెల 24వ తేదీ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12:45 గంటల వరకూ జరిగే పరీక్షకు విద్యార్థులు ఉదయం 8.45 గంటలకే హాజరు కావాలన్నారు. పట్టణంలోని రుస్తుంబాద హైస్కూల్, జెసికిలి స్కూల్, ఎస్ఎన్ఎస్, గౌతమి, మిషన్ హైస్కూల్‌లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని తెలిపారు.

ఓట్ల లెక్కింపు సిబ్బంది సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులకు ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎన్నికల ప్రక్రియలో భాగంగా చేపట్టే ఓట్ల లెక్కింపు అత్యంత కీలకమని, దీనికి కేటాయించిన సిబ్బంది అప్రమత్తతతో ఓట్ల లెక్కింపు ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఆయన జిల్లాలోని రిటర్నింగ్ అధికారులతో ఓట్ల లెక్కింపు ప్రక్రియలో వివిధ దశలు, పాటించాల్సిన నిబంధనలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని, సొంత నిర్ణయాలు తీసుకోకూడదని స్పష్టం చేశారు. చిన్న పొరపాటుకూ తావివ్వరాదని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమకు కేటాయించిన విధులను పూర్తి చేయాలని ఆదేశించారు. దీనికోసం ఈ ప్రక్రియపై అందరూ సమగ్ర అవగాహన కల్పించుకోవాలని సూచించారు. ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, కౌంటింగ్ సూపర్‌వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు (రిజర్వ్ సిబ్బందితో సహా) ఉదయం ఆరు గంటల్లోపు కౌంటింగ్ కేంద్రంలో రిపోర్ట్ చేయాలన్నారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్లు అధిక సంఖ్యలో పోలైనందున, లెక్కింపు పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుందని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సూపర్‌వైజర్లు, సహాయకులకు మొదటిదఫా శిక్షణా తరగతులు ఈ నెల 25న నిర్వహిస్తామన్నారు. కౌంటింగ్ ఏజెంట్లు, సూపర్‌వైజర్లు, అసిస్టెంట్లు ఉదయం ఏడు గంటలకు తమ తమ సీట్లలో కూర్చున్న తర్వాత, కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎవరూ కౌంటింగ్ హాల్ నుండి బయటకు వెళ్లడానికి అనుమతి ఉండదన్నారు. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా తమ గుర్తింపు కార్డును ధరించాలని, అవిలేకపోతే లోపలికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తొలివిడత లెక్కింపు, మలివిడత లెక్కింపు ప్రక్రియలను వివరించారు. కౌంటింగ్ హాలులో రిటర్నింగ్ అధికారులదే సర్వాధికారమని, వారే పూర్తిగా నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. సిబ్బందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయిస్తామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ చందన దుర్గాప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ మద్రాపు సన్యాసిరావు పాల్గొన్నారు.



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న కలెక్టర్

25, 26 తేదీల్లో లయన్స్ సేవా కార్యక్రమాలు

పాలకొల్లు: ఈ నెల 25, 26 తేదీల్లో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా వార్షిక సమావేశంలో లయన్స్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు పాల్గొంటారు. ఈ సందర్భంగా రూ.20 లక్షలకుపైగా విలువైన సేవా కార్యక్రమాలు ఆయన చేతుల మీదుగా చేపడతారు. క్లబ్ ద్వారా శిక్షణ పొందిన పలువురు మహిళలకు టైలరింగ్ సర్టిఫికెట్లు అందజేస్తారు. అంజలి మానసిక వికలాంగుల పాఠశాలలో ఇన్నోవేషన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభిస్తారు. లయన్స్ కంటి ఆసుపత్రిలో నూతనంగా నిర్మించిన లిఫ్టును ఆయన ప్రారంభిస్తారు. 26వ తేదీ సాయంత్రం సేవా మహోత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలువురికి సైకిల్ కుట్టు మిషన్లు, స్పోర్ట్స్‌కిట్లు, వెట్ గ్రైండర్‌లు, విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు అందజేస్తారు.

బిఎల్‌ఒల బకాయి గౌరవ వేతనం వెంటనే చెల్లించాలి

గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం వినతి

ఏలూరు అర్బన్: రాష్ట్రంలో బిఎల్‌ఒలకు గౌరవ వేతనం గత మూడు సంవత్సరాల నుండి ఇవ్వడం లేదని, వెంటనే బకాయి గౌరవ వేతనం ఒకొక్కరికి సుమారు రూ.18 వేలు వెంటనే అందజేయాలని రాష్ట్ర అదనపు ప్రధాన ఎన్నికల అధికారి పి.కోటేశ్వరరావును కోరినట్లు గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయనకు వినతిపత్రం అందజేశామని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన అదనపు ఎన్నికల అధికారి బిఎల్‌ఒలకు సంబంధించిన గౌరవ వేతనం ఫైల్ ఫైనాన్స్‌లో ఉందని, త్వరలోనే నిధులు విడుదలవుతాయని తెలిపారని పేర్కొన్నారు.



కూటమి గెలుపు తథ్యం


టిడిపి జిల్లా అధ్యక్షులు మంతెన రామరాజు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో కూటమి గెలుపు తథ్యమని, రాష్ట్రం మరలా పురోగతి సాధిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు, ఉండి శాసనసభ్యులు మంతెన రామరాజు అన్నారు. గురువారం ఆయన తాడేపల్లిగూడెం టిడిపి కార్యాలయానికి విచ్చేసి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల మల్లికార్జునరావు (బాబ్జి)ని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి అవుతారన్నారు. రాష్ట్రం మళ్లీ పురోగతి సాధిస్తుందన్నారు. పొత్తులో భాగంగా తాడేపల్లిగూడెం నియోజకవర్గం జనసేనకు కేటాయించినప్పటికి వలవల బాబ్జీ ఆదేశాల మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి మద్దతు తెలిపి, కష్టపడి పనిచేశారని కొనియాడారు. వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోతుల అన్నవరం, పరిమి రవికుమార్, దాసరి అప్పన్న, కిలపర్తి వెంకట్రావు, గంధం సతీష్, ముత్యాల సత్యనారాయణ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పిల్లలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - కాళ్ల


పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

దొడ్డనపూడిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పిఒఆర్‌బిఎస్‌కె ఎఒ డాక్టర్ భావన గురువారం సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం సక్రమంగా అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. కాళ్ల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అంగన్‌వాడీ కేంద్రంలో ఆరుగురు పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బెడ్ రెస్ట్ తీసుకుంటున్న వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. పిల్లలకు, మహిళలకు, గర్భిణులకు పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఐదేళ్లలోపు పిల్లలకు పుట్టుకతో అనారోగ్య సమస్యలుంటే తణుకు పిహెచ్‌కి తీసుకెళ్తే ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తుందని సునీల్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎం దుర్గ, ఎంఎల్‌హెచ్ పి.సతీష్, ఆశా వర్కర్ సరిత పాల్గొన్నారు.

పింఛన్ అందకుండా చేసింది టిడిపియే

డిసిఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ

ప్రజాశక్తి - పాలకొల్లు

వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్ద వాలంటీర్ల ద్వారా పెన్షన్ అందకుండా చేసింది టిడిపి అని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. గురువారం ఆయన వైసిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇప్పుడు ఒక వృద్ధుడిని తీసుకొని ప్రచారం కోసం ఎంఎల్ఎ బ్యాంకు వద్దకు వెళ్లడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌తో పిటీషన్ వేయించి, వృద్ధులపై కనీసం జాలి లేకుండా చేసింది టిడిపి అని ఆయన విమర్శించారు. పట్టణంలో దమయపత్రి డ్రెయిన్ పనులు వైసిపి ప్రభుత్వంలో చేయకుండా చేసింది ఎంఎల్ఎ అని ఆయన విమర్శించారు. గత టిడిపి హయాంలో నష్టంతో పనులు చేస్తున్న ఒక యువ కాంట్రాక్టర్ టిడిపి నేతలు ఏడిపించడంతో ఆయన స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. డాక్టర్ బాబ్జి హయాంలో దమయపత్రి డ్రెయిన్ పనులు ప్రారంభించగా, బంగారు ఉషారాణి హయాంలో నాలుగు కోట్ల పనులు చేశారని, అయితే తరువాత టిడిపి హయాంలో కూడా పనులు జరగకుండా చేశారని ఆయన ఆరోపించారు.

గుర్తు తెలీని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - పెనుమంట్ర


మృతురాలు కొండారత్నం

రోడ్డు దాటుతున్న వృద్ధురాలని గుర్తు తెలీని వాహనం ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని నత్తారామేశ్వరం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. అత్తిలి మండలం పాలి గ్రామానికి చెందిన ఒడిబోయిన కొండారత్నం (63) నత్తారామేశ్వరం గ్రామంలోని అమ్మవారి గుడివద్ద జరిగిన వేడుకల్లో భోజనానికి వచ్చి రోడ్డు దాటుతోంది. ఈ క్రమంలో అటుగా వెళ్లిన గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. దీంతో కొండారత్నం అక్కడికక్కడే మృతి చెందింది. భర్త, పిల్లలు లేని ఆమె మేనల్లుడు వద్ద ఉంటోందని, మేనల్లుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువకునిపై పోక్సో కేసు నమోదు

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని బాలికకు ఓ యువకుడు మాయమాటలు చెప్పి, తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లిన సంఘటన నేపథ్యంలో బుధవారం రాత్రి స్థానిక పోలీస్ స్టేషన్లో అతనిపై పోక్సో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను భీమవరం ప్రాంతానికి చెందిన యువకుడు ప్రేమ్‌చంద్ బయట భోజనం చేసొద్దామని మభ్య పెట్టి తన వాహనంపై బాలికను తీసుకెళ్లాడు. వీరవాసరం గ్రామంలో బాలిక తండ్రీ కనిపించగా బాలిక సదరు యువకుడి నుంచి తప్పించుకుని ఇంటికి చేరింది. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు యువకునిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - తణుకు

మండలంలోని వెంకట్రాయపురంలో వ్యభిచార గృహంపై గురువారం పోలీసులు దాడి చేశారు. ఒక ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి ఇద్దరు నిర్వాహకులతో పాటు ఇద్దరు యువతులు, మరో ఇద్దరు విటులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వేల్పూరు గ్రామానికి చెందిన ఒక అతను, తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన మహిళ వ్యభిచారం గృహం నిర్వహిస్తున్నట్లు సమాచారం.

'సెవెన్ స్టార్స్'పై కేసు నమోదు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న సెవెన్ స్టార్స్ (సాఫ్ట్‌డ్రింక్స్) కంపెనీపై కేసు నమోదు చేశామని విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ యుజె.విల్సన్ తెలిపారు. తమకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు మండలంలోని రామన్న గూడెంలోని 7 స్టార్స్ బాట్లింగ్ కంపెనీపై గురువారం ఆకస్మికంగా దాడి చేశామని తెలిపారు. ఈ సందర్భంగా అనధికారికంగా అనుమతులు లేకుండా లెమన్ సాఫ్ట్ డ్రింక్స్ తయారు చేసి, వాటిని సీసాలో నిల్వ చేసి చుట్టుపక్క గ్రామాల్లోను, పట్టణంలోను వాహనంపై సరఫరా చేస్తున్నారని వివరించారు. ఈ కంపెనీపై కేసు నమోదు చేశామని ఆయన వివరించారు. ఈ దాడిలో విజిలెన్స్ ఎస్ఐ రంజిత్ కుమార్, ఫుడ్‌సేఫ్టీ అధికారి సుందర రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

తక్కువ ఫీజుతో కార్పొరేట్ విద్య..

జ్ఞానానంద సొంతం

సంస్థ అకడమిక్ డైరెక్టర్ దాట్ల విజయకుమారి


జ్ఞానానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్




కట్టామణి విఘ్నేష్

ప్రజాశక్తి - కాళ్ల

తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్యనందించడమే తమ పాఠశాల లక్ష్యమని జ్ఞానానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్ అకడమిక్ డైరెక్టర్ దాట్ల విజయకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో మాట్లాడారు. అందరికీ నాణ్యమైన విద్యనందించడానికి మాజీ సర్పంచి దాట్ల చిన్న రామచంద్రరాజు 1989లో ఏలూరుపాడు గ్రామంలో జ్ఞానానంద పబ్లిక్ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించారని, ప్రయిమరీ విద్యతో సంస్థను ప్రారంభించారని తెలిపారు. ప్రైమరీ విద్యతో ఆరంభించి అంచలంచెలుగా హై స్కూల్ స్థాయికి ఎదిగిందన్నారు. దాట్ల విజయకుమారి సారథ్యంలో జిల్లాలోని సమీప గ్రామాలు, కృష్ణా జిల్లా నుంచి విద్యార్థులను ఆకర్షించి నంబర్ వన్ పాఠశాలగా అభివృద్ధి చెందిందన్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు అతి పెద్ద ఆటస్థలం, సమీప గ్రామాల నుంచి విద్యార్థులను పాఠశాలకు చేర్చేందుకు బస్సు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. అంతేగాక క్రీడలు, సంగీతం, డాన్స్, భగవద్గీత, కరాటేలో శిక్షణ ఇస్తున్నామన్నారు. పదో తరగతి విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తీసుకుని సాయంత్ర వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. హైస్కూల్ ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకూ ప్రతి సంవత్సరమూ 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారన్నారు. మండల స్థాయిలో మొదటి, రెండో స్థానం సాధిస్తున్నారన్నారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో జ్ఞానానంద విద్యార్థులు విజయదుందుభి మోగించారని తెలిపారు. మండలంలో 570 మార్కులతో ప్రథమ స్థానం కట్టా మణి విఘ్నేష్, 564 మార్కులతో ద్వితీయ స్థానం అంకాల రమ్య జ్యోతి, పొన్నాడ కావ్యాంజలి, 556 మార్కులతో తతీయ స్థానం దాట్ల హర్ష శ్రీవెంకట రామరాజు సాధించారన్నారు. మొత్తం 47 మంది విద్యార్థులకు గాను 42 మంది ప్రథమ శ్రేణిలో, ముగ్గురు ద్వితీయ శ్రేణిలో, ఇద్దరు తతీయ శ్రేణిలో విజయం సాధించారని, వారి విజయానికి జ్ఞానానంద విద్యా సంస్థల సెక్రటరీ కరస్పాండెంట్ డిజెఎస్ఆర్.శ్రీనివాసవర్మ, ప్రధానోపాధ్యాయులు ఎం.త్రిమూర్తిరాజు, ఉపాధ్యాయులు కృషి ఎంతో ఉందన్నారు. 500 మార్కులపైగా సాధించిన విద్యార్థులు 11 మంది, 400 మార్కులు పైగా సాధించిన విద్యార్థులు 22 మంది ఉన్నారన్నారు.

జూనియర్ కళాశాల..

ఈ ప్రాంతంలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు దూర ప్రాంతాలకెళ్లి చదువుకోవడానికి కష్టంగా ఉన్న నేపథ్యంలో 2007-08లో దాట్ల చిన్న రామచంద్రరాజు జూనియర్ కళాశాలను స్థాపించి పేద విద్యార్థులకు అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ విద్యనందిస్తున్నామన్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ విద్యార్థులకు ప్రయోగశాలలు (లాబ్స్) ఉన్నాయని తెలిపారు. కళాశాల వద్ద ప్రయోగ పరీక్షలు జరుగుతున్నాయన్నారు. కళాశాలలో ఏటా 80 శాతానికి పైగా విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నారని తెలిపారు. ఎంపిసి, బైపిసి, విద్యార్థులకు ఇఎపి సెట్ కోచింగ్ ఇస్తున్నామన్నారు. గత సంవత్సరం ఈ కళాశాల విద్యార్థినులు ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్, విష్ణు ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్లు సాధించారన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందిస్తున్నామన్నారు.

కొనసాగిన వేసవి శిక్షణ శిబిరాలు

ప్రజాశక్తి - నరసాపురం


నరసాపురం : విద్యార్థులకు కథలు చెబుతున్న వైనం

ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం పిల్లలకు కథలు చెప్పడం, కథలు చెప్పించడం, నాయకుల జీవిత చరిత్రలు చదివించారు. అనంతరం లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ ఎ.నలినీదేవి మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం వాటి ఉపయోగాలు, లయన్స్ ఇంటర్నేషనల్ సేవా సంస్థల గురించి వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు మొక్కలు, స్నాక్స్ పంపిణీ చేశారు. స్పోకెన్ ఇంగ్లీష్, యోగా, మెడిటేషన్, గణితంలో మెలకువలు, క్రాఫ్ట్‌లో శిక్షణ ఇచ్చారు. స్కూల్ అసిస్టెంట్ జి.శ్రీనివాస్, స్కూల్ హెచ్ఎం నాగలక్ష్మి, సుధీర్ మోహన్, సూర్యంబాబు, ప్రవీణ్, జీవన్ రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. జూన్ ఏడో తేదీ వరకూ జరిగే ఈ సమ్మర్ క్యాంపులో పిల్లలందరూ పాల్గొనాలని గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు.

గణపవరం: గణపవరం గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరం ప్రారంభించినట్లు గ్రంథాలయ అధికారి సుభాషిని తెలిపారు. శిక్షణ శిబిరంలో విద్యార్థులకు నీతి కథలు చిత్రలేఖనం, చెస్, క్యారమ్స్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు. ఈ శిబిరాన్ని విద్యార్థినులు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుమ్మడి సుబ్బారావు చదువుల సంఘ నాయకులు పాల్గొన్నారు.

50 మంది పిల్లలకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

3ఎఫ్ ఇండస్ట్రీస్ వారి స్వాభిమాన్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో, ఏలూరు ఆశ్రం హాస్పిటల్ వారి సహకారంతో 3ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్‌లో పిల్లలకు బాబా అనందమూర్తి జీయర్ పుట్టినరోజు సందర్భంగా గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 50 మంది పిల్లలకు కంటి, చర్మ, సాధారణ వైద్య పరీక్షలు చేసి అవసరమైన పిల్లలకు మందులు ఉచితంగా అందజేసినట్లు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమం హాస్పిటల్ వైద్య సిబ్బంది చర్మ వైద్య నిపుణులు వైవి.రవిశంకర్, సాధారణ వైద్య నిపుణులు ఆదిత్య, కంటి వైద్య నిపుణులు వై.రమణయ్య, పిల్లల వైద్య నిపుణులు లక్ష్మినారాయణ వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా 3ఎఫ్ ఇండస్ట్రీస్ డైరెక్టర్ ప్రకాష్ గోయంకా, జనరల్ మేనేజం జనార్ధన్, 3ఎఫ్ ఇండస్ట్రీస్ కోఆర్డినేటర్ వేమాల శ్రీనివాస్ పాల్గొన్నారు.


పిల్లలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

కన్నుల పండుగగా వెంకన్న రథోత్సవం


రథోత్సవం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఆలయ అధికారులు

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరు గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక కళ్యాణోత్సవాల్లో భాగంగా ఏడో రోజు గురువారం స్వామివారి రథోత్సవం కన్నులపండుగగా జరిగింది. ఈ రథోత్సవం కోలాటాల నడుమ కొనసాగింది. శక్తి వేషాలు, తీన్మార్, కేరళ డప్పులు, బ్యాండ్ మేళం, సన్నాయి మేళం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. స్వామివారి రథోత్సవం అంగరంగ వైభవంగా ఆలయ ఇఒ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రథోత్సవం సందర్భంగా యాత్రికులతో కాళ్లకూరు ప్రాంతం కిటకిటలాడింది. దాతలు, యాత్రికులు, ఆలయ ఇఒ ఎం.అరుణ్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. తొలుత స్వామివారికి రజిత పుష్పాలతో విశేషార్చన నిర్వహించారు. అయితే భీమవరానికి చెందిన అల్లూరి పద్మరాజు, పద్మ దంపతుల ఆర్థిక సహకారంతో పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఇ.సుబ్బారావు, దేవాదాయ, ధర్మాదాయ శాఖ భీమవరం ఇన్‌స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, మాజీ ఎంపిపి వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు పాల్గొన్నారు. అనంతరం స్వామి వారి ఖాళీ స్థలంలో బాణసంచా కాల్చారు. భీమవరం వారిచే స్వాతి ఆర్కెస్ట్రా సంగీత విభావరి నిర్వహించారు.

ఉండి : ఉండి కాపులపేటలో శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాహ్నిక కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం గ్రామ పురవీధుల్లో రథోత్సవం కార్యక్రమాన్ని ఆలయ అధికారులు కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ మేనేజర్ రుద్రరాజు ఫణి రామకిషోర్ వర్మ మాట్లాడుతూ 17వ శతాబ్దంలో మొగల్తూరు వంశీయుల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరిగిందన్నారు. తొలుత 750కి పైగా భారత నాట్యం ప్రదర్శనలు ఇచ్చిన తూర్పుగోదావరి జిల్లా కొత్తకోటకు చెందిన కె.సత్యవాణి చేసిన భరతనాట్యం ప్రదర్శన పలువురిని విశేషంగా ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో కొమ్మన రాఘవ, కొమ్మన నాగబాబు, గుండాబత్తుల సుబ్బారావు, కలిసిపూడి ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

14 రౌండ్లలో ఉంగుటూరు ఫలితం

రిటర్నింగ్ అధికారి ఖాజావలీ





ప్రజాశక్తి - ఉంగుటూరు

ఏలూరు సిఆర్ రెడ్డి కళాశాల ప్రాంగణంలో జూన్ 4న ఉంగుటూరు నియోజకవర్గ ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పూర్తి కావొచ్చాయని, 14 రౌండ్లలో ఈ నియోజకవర్గ ఫలితం వెల్లడి కానుందని ఉంగుటూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎన్ఎస్‌కె.ఖాజావలీ తెలిపారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ నియోజకవర్గంలో 214 పోలింగ్ కేంద్రాల్లో 2,06,437 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,81,152 మంది తమ ఓటు హక్కును ఇవిఎంల ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు. 1307 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా, 397 మంది వృద్ధులు, వికలాంగులు హోమ్ ఓటింగ్ ద్వారా మొత్తం 1704 పోస్టల్ ఓటింగు నమోదైందన్నారు. వివిధ ఉద్యోగులు సర్వీస్ ఓటర్లుగా ఓటు వేసేందుకు 197 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా వీరిలో 195 మంది సర్వీస్ ఓటు డౌన్‌లోడ్ చేసుకుని ఓటు వేసి వాటిని రిటర్నింగు అధికారికి పోస్టు చేశారని, ఈ నెల 23 నాటికి ఆలా సర్వీసు ఓటర్ల ఓట్లు 66 తమకు అందాయని తెలిపారు. జూన్ 4వ తేదీ ఉదయం 7.59 గంటల వరకూ అంటే లెక్కింపు రోజు చివరి నిమిషం వరకూ సర్వీస్ ఓటును స్వీకరించి వాటిని కూడా లెక్కింపులో పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. ఇవిఎంల్లో డేటాను లెక్కించేందుకు 14 టేబుళ్లను సిద్ధం చేయనున్నామన్నారు. ఆరోజు ఉదయం 8 గంటల నుంచే ఒకపక్క పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు, మరోపక్క ఇవిఎంల్లో ఓట్లనూ లెక్కిస్తామన్నారు. ముందుగా ఉంగుటూరు మండలం యర్రమిల్లిపాడు ఒకటో పిఎస్ నుంచి లెక్కింపు మొదలై ఆఖరు పిఎస్ అయిన గణపవరం మండలం ఎస్.కొండేపాడు పోలింగు బూత్ 214తో కౌంటింగ్ పూర్తి కావాల్సి ఉంటుందన్నారు. ఒక్కో రౌండులో 14 ఇవిఎంల్లో ఓట్లు లెక్కించి రౌండ్ల వారీగా ఫలితాలను నమోదు చేస్తామన్నారు. గెలిచిన అభ్యర్థికి అదే రోజు ధ్రువీకరణపత్రం అందజేస్తామన్నారు. ఈ మేరకు పోటీ చేసిన అభ్యర్థులు, చీఫ్ కౌంటింగ్ ఏజెంట్లకు అవగాహనా సమావేశం ఉంగుటూరులో నిర్వహించినట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలివే

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈ నెల 24వ తేదీ శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, కనుక వినియోగదారులు సహకరించాలని నరసాపురం డివిజన్ ఎఇ బి.సురేష్‌కుమార్ తెలిపారు. మార్టేరు 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో మార్టేరు, నెగ్గిపూడి, వెలగలేరు, శివరావుపేట, కోడేరు రోడ్డు ఏరియాలో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఆలమూరు 33/11 కెవి సబ్ స్టేషబ్ పరిధిలో ఆలమూరు, ఒడూరు, నెలమూరు, భట్లమగుటూరు, వివి పాలెం గ్రామాలకు 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో పెనుమంట్ర, బ్రాహ్మణచెరువు, పోలమూరు, నత్తారామేశ్వరం, జుత్తిగ, మల్లిపూడి, మాముడూరు, సోమరాజు ఇల్లిందలపర్రు గ్రామాలకు చెట్ల కొమ్మలు తొలగించడం, లైన్ మెయింటినెన్స్ నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మొగల్తూరులో అన్నదానం

ప్రజాశక్తి - మొగల్తూరు

మొగల్తూరు కోట రోడ్డులోని దత్తసాయి మందిరంలో గురువారం అన్న సమారాధన చేశారు. యాత్రికులు బాబా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమంలో అధిక సంఖ్యలో యాత్రికులు పాల్గొన్నారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా నిర్వహణ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

సృజనాత్మక దర్శకుడు రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

రొమాంటిక్, కామెడీ, ఫాంటసీ, మెలోడ్రామా, యాక్షన్ థ్రిల్లర్, జీవిత కథలు ఇలా ఆయన వెండితెరపై చూపని అంశం లేదేమో.. సినిమా అంతా ఒక ఎత్తయితే పాటలు మరో ఎత్తు అనేలా ఆయన దర్శకత్వం సాగుతుంది. పండ్లు, పూల నేపథ్యంలో పాటల్ని తెరకెక్కిస్తూ వెండితెరని ఒక పెయింటింగ్‌లా మార్చేస్తుంటారు.. ఆ సృజనాత్మక దర్శకుడు రాఘవేంద్రరావు. గురువారం రాఘవేంద్రరావు పుట్టినరోజు సందర్భంగా అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి సభ్యులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, బొండా రామకృష్ణారావు (రాంబాబు) ఆయనతో ఉన్న మధుర జ్ఞాపకాలను నెరవేసుకున్నారు. తెలుగు సినీరంగంలో దర్శకేంద్రుడు అని పిలువబడే శతాధిక చిత్రాల దర్శకుడు, రచయిత, నిర్మాత కె. రాఘవేంద్రరావు అన్నారు. 2014లో ఎన్‌టిఆర్ జాతీయ పురస్కారం, బిఎన్ రెడ్డి జాతీయ పురస్కారం అందుకున్నారని, తొలి చిత్రం శోభన్ బాబుతో బాబు సినిమా చేశారని తెలిపారు.


బారులు తీరిన ఓటర్లు (ఫైల్‌ఫొటో)

అభ్యర్థుల ఇలాకా.. పోలింగ్ కేక..

ప్రజాశక్తి - కాళ్ల

సార్వత్రిక ఎన్నికల సమరం ముగిసి పది రోజులైంది.. ఉండి నియోజకవర్గంలో 86.20 శాతం ఓటింగ్‌తో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచింది. నియోజకవర్గంలో వైసిపి ఎంఎల్ఎ అభ్యర్థిగా పివిఎల్ నరసింహరాజు, టిడిపి కూటమి ఎంఎల్ఎ అభ్యర్థి కనుమూరి రఘు రామకృష్ణంరాజు, కాంగ్రెస్ పార్టీ తరపున వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా వేటుకూరి వెంకట శివరామరాజులు పోటీలో ఉన్నారు. ఆకివీడు మండలం ఐ భీమవరంలో రఘురామకృష్ణంరాజు, ఉండి మండలం యండగండిలో పివిఎల్ నరసింహరాజు, కాళ్ల మండలం కాళ్లకూరులో గోపాలకృష్ణంరాజు, కలవపూడి గ్రామంలో శివరామరాజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉండి నియోజకవర్గంలో 2,24,725 మంది ఓటర్లకుగాను 1,93,783 ఓట్లు పోలయ్యాయి. 86.20 శాతం ఓటింగ్ నమోదై రికార్డు నెలకొల్పారు. పురుష ఓటర్లు 87.80 శాతంతో 96707 మంది ఓటు వేయగా, 84.72 శాతంతో 97074 మంది మహిళా ఓటర్లు, ఇద్దరు ట్రాన్స్ జెండర్ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో అందరి దృష్టి ఉండిలో పోలింగ్‌పై పడేటట్టు చేసింది. నియోజకవర్గంలో పురుషులు కన్నా మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. మొత్తం పురుషుల కంటే మహిళల ఓట్ల శాతం గణనీయంగా పెరిగింది. ఒకసారి నాయకుల సొంత గ్రామాల్లో పోలింగ్ శాతం పరిశీలిస్తే వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పివిఎల్ నరసింహరాజు ఓటు వేసిన యండగండి గ్రామంలో 13 పోలింగ్ బూత్‌లో 871 ఓట్లకు 753 ఓట్లు పోలయ్యాయి. 86.45 ఓటింగ్ శాతం నమోదైంది. ఆకివీడు మండలం ఐ.భీమవరంలో రఘు రామకృష్ణంరాజు ఓటు వేసిన 152 పోలింగ్ బూత్‌లో 919 ఓట్లకు 760 ఓట్లు పోలయ్యాయి. 82.70 ఓటింగ్ శాతం నమోదైంది. కాళ్ల మండలం కాళ్లకూరు గ్రామంలో గోపాలకృష్ణంరాజు ఓటు వేసిన 196 పోలింగ్ బూత్‌లో 1100 ఓట్లకు గాను 959 ఓట్లు పోలయ్యాయి. 87.18 శాతం నమోదైంది. కాళ్ల మండలం కలవపూడి గ్రామంలో శివరామరాజు ఓటు వేసిన 234 పోలింగ్ బూత్‌లో 904 ఓట్లకు 801 ఓట్లు పోలయ్యాయి. 88.61 ఓటింగ్ శాతం నమోదైంది.